క్లుప్తంగా

ఈకేవైసీ పూర్తిచేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మన్మథరావు

జలుమూరు: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ ఈకేవైసీని పూర్తిచేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా బూత్ వింగ్ అధ్యక్షుడు దామ మన్మథరావు అన్నారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకేవైసీ పూర్తికాకపోతే రుణాలు, పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాలు జరిగితే పరిహారం, ధాన్యం విక్రయించేందుకు ఇబ్బందులు వస్తాయన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ఈకేవైసీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మోక్షగుండం సేవలు ఎనలేనివి



మోక్షగుండం చిత్రపటానికి పూలమాలవేస్తున్న హెచ్‌ఎం వైకుంఠరావు

పాతపట్నం: మోక్షగుండం విశ్వేశ్వరయ్య (భారతరత్న) దేశానికి చేసిన సేవలు ఎనలేనివని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు అన్నారు. సోమవారం ఇంజినీర్స్ డే సందర్భంగా పాఠశాలలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య సుప్రసిద్ధ ఇంజినీర్ అని, అనేక ఆనకట్టలు, వంతెనలు కట్టి నీటిపారుదల, సాగునీటి పథకాల ద్వారా జలవనరుల సద్వినియోగానికి కృషి చేసి అంతర్జాతీయంగా గుర్తింపు పొందారన్నారు. ఆయన మన దేశంలో కాకుండా అనేక దేశాల్లో సేవలు అందించారన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



డీటీ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పొందూరు: దీర్ఘకాలంగా ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కారించాలని ఏపీటీఎఫ్ సభ్యులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. డీటీ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ సభ్యులు కె.విజయకుమార్, పి.తిరుమలరావు, డి.వీరయ్య, కె.రమేష్, కె.వెంకటరమణ, దుంప రవి, రమణారావు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే గోవిందరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పాతపట్నం: ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని, అసైన్‌మెంట్ విధానాన్ని తొలగించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.ఢిల్లేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. అనంతరం తహసీల్దార్ ఎస్.ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో సంఘం ప్రధాన కార్యదర్శి జె.ధర్మారావు, అప్పలరాజు, నారాయణమూర్తి, ప్రసాదరావు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు ఏపీఎంపై ఫిర్యాదు

కొత్తూరు: కొత్తూరు ఏపీఎం ఎ.లలితకుమారి అవినీతి, అక్రమాలపై శ్రీకాకుళంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎంఎంఎస్ అధ్యక్షురాలు ఆర్.జయమ్మ, గ్రామాఖ్య సంఘాల అధ్యక్షులు ఫిర్యాదు చేశారు. ఏపీఎం విధులకు సక్రమంగా హాజరుకావడం లేదన్నారు. వీఓఏలను అగౌరవపరిచేలా వ్యవహరిస్తున్నారన్నారు. పాలకవర్గం చెప్పిన తీర్మానాలను చేయకుండా ఏపీఎంకు నచ్చిన అంశాలను అజెండాల్లో రాయిస్తున్నారన్నారు. గ్రామాఖ్య సంఘాల రికార్డులను గ్రామ సంఘాల అధ్యక్షులకు చూపించడం లేదన్నారు. ఉల్లాస నిధులను ఇంతవరకు అందజేయలేదన్నారు. ఏపీఎంపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు.

చర్యలు తీసుకోవాలి

హిరమండలం: మండలంలోని గొట్టా గ్రామంలో తన పేరిట బలిజ రమణమూర్తి అనే వ్యక్తి అనధికారికంగా చలామణి అవుతున్నారని.. ఆయనపై చర్యలు తీసుకోవాలని ఉప సర్పంచ్ సిద్దా పద్మ విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాదరావుకు ఫిర్యాదు చేశారు. గత కొద్దిరోజులుగా తన పేరును అనేక రకాలుగా వాడుకుంటున్నారని చెప్పారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

చిరుతిళ్లు ఆరోగ్యానికి చేటు



బుడితిలోని ఒక పాన్‌షాప్‌లో వేలాడుతున్న జంక్ ఫుడ్ ప్యాకెట్లు

- నాసిరకంగా చిరుతిళ్లు, జంక్ ఫుడ్స్
- చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

సారవకోట: ఒకప్పుడు చిరుతిళ్లు అంటే సంవత్సరంలో ఏదో ప్రత్యేకమైన పండగ రోజుల్లో ఇంట్లో చేసుకునే పిండి వంటలైన చుప్పులు, జంతికలు, అరెసలు, చేగొడియాలు ఇలాంటివి గుర్తొస్తాయి. అవి ఇంట్లో మన చేతుల మీదుగా తయారు చేసుకుంటాం కాబట్టి అవి ఆరోగ్యానికి మంచివి. ప్రస్తుత కాలంలో మాత్రం చిరుతిళ్లు అంటే ప్యాకెట్ల రూపంలో దొరికే నాశిరకం చిప్స్, రకరకాల మసాలాలు, టేస్టింగ్ సాల్ట్, ఫుడ్ కలర్‌తో చేసే ఆహార పదార్థాలు. ఇవి కంటికి అందంగా, నోటికి రుచిగా ఉన్నా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. నాసిరకంగా ఉండటం వలన శరీరంలోని వివిధ అవయువాలను దెబ్బతీస్తాయి. ముఖ్యంగా ప్రజల్లో ఈ చిరుతిళ్లపై అవగాహన లేమి కారణంతోపాటు అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వీటి అమ్మకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చిన్నారులే అధికంగా..

మార్కెట్లోకి వచ్చే కొత్తరకం చిరుతిళ్లను తినేందుకు చిన్నారులు అధికంగా ఇష్టపడుతుంటారు. పెద్దలు కూడా వారి ఇష్టాన్ని కాదనకుండా కొని ఇస్తుంటారు. వీటిలో నాణ్యతలేని పదార్థాలు తినడం వలన చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రధానంగా చిన్న, చిన్న పాన్ షాపులు, వీధి వ్యాపారుల వద్ద కొనుగోలు చేసే ఈ తినుబండరాలు నాణ్యత లేనవిగా ఉంటున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బ్రాండెడ్ కానివి..

కొన్ని బ్రాండెడ్ పదార్థాలు విక్రయించే కంపెనీ అక్షరాలలో ఒకటి, రెండు అక్షరాలు మార్చేసి అదే లోగో కొంత మంది అక్రమ వ్యాపారులు చిరుతిళ్ల ప్యాకెట్లు తయారు చేస్తున్నారు. వాటిని గ్రామాల్లో విక్రయించడంతో పిల్లల తల్లిదండ్రులు, పిల్లలు వీటిని కొనుగోలు చేస్తు తింటున్నారు. ఇటువంటి బ్రాండెడ్ కాని ఈ తినుబండారాళ్లు పక్కనున్న ఒడిశా రాష్ట్రం నుంచి దళారులు కొనుగోలు చేసి గ్రామాల్లో విక్రయిస్తున్నారు.

అధిక కమీషన్..

బ్రాండెడ్ కంపెనీ వారి తినుబండరాలు అమ్మితే ప్యాకెట్‌కు 50 పైసలు మాత్రమే కమీషన్ వస్తోంది. అదే లోకల్‌లో తయారు చేసే అన్‌బ్రాండెడ్ తినుబండరాలు విక్రయిస్తే ప్యాకెట్‌కు రూపాయికి పైనే కమీషన్ వస్తోంది. దీంతో వ్యాపారులు నాసిరకం చిరుతిళ్లు కొనేసి విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు.

తనిఖీలు నామమాత్రం..

విచ్చలవిడిగా అమ్ముతున్న నాసిరకం తినుబండరాలను అరికట్టేందుకు అధికారులు తనిఖీలు నామమాత్రంగా ఉన్నాయి. ఆహార తనిఖీలు, తూనికలు, కొలతల శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వీటి అమ్మకాలు రోజు, రోజుకూ పెరిగిపోతున్నాయి. బాగా కనిపించడం, రుచి కోసం చాలా రకాల చిరుతిళ్లల్లో ఆరోగ్యానికి హానికరమైన రసాయనాలు వాడుతున్నారు. అలాంటివి తింటే ఆరోగ్యం పోతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి



చిరుతిళ్లు, జంక్ ఫుడ్‌కు అందరూ దూరంగా ఉండాలి. రుచి, ఎక్కువ కాలం నిల్వ ఉండేందుకు వివిధ రకాల రసాయనాలు, రంగులు వాడుతుంటారు. అటువంటి చిరుతిళ్లు తీసుకోవడం వలన పిల్లల్లో కడుపు నొప్పి, అజీర్తి వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇదే కొనసాగితే పేగు సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది.

– సుస్మిత, వైద్యులు, బొంతు పీహెచ్‌సీ, సారవకోట మండలం

బలవంతపు భూసేకరణ ఆపాలి

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం పేరుతో రైతుల వద్ద నుంచి బలవంతపు భూసేకరణ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేదంటే పోరాటాలు ఉధృతం చేస్తామని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సంతోష్, కె.శ్రీనివాస్, గిరిజన సమాఖ్య నాయకుడు సింహాచలం హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం మానవాళి మనుగడుకు ప్రమాదం తెచ్చే కంపెనీలను ప్రజలనెత్తిన రుద్ది లక్షలాది ఎకరాల భూములు కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసేందుకు కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. రైతుల అనుమతి లేకుండా డ్రోన్ సర్వేలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ప్రతినిధులు వసంత్, ధర్మారావు, సుబ్రహ్మణ్యం, కిశోర్, గిరిజన సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

థర్మల్ పవర్ ప్లాంట్ వద్దు

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు వాబ యోగి

బూర్జ: ఆదివాసీల జీవితాలతోపాటు పర్యావరణాన్ని నాశనం చేసే థర్మల్ పవర్ ప్లాంట్‌ను బూర్జ మండలంలో నిర్మాణం చేపట్టవద్దని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు వాబ యోగి కూటమి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని మసానపుట్టి, అడ్డూరిపేట గ్రామాల్లో సోమవారం ర్యాలీ నిర్వహించి ప్రజలకు చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా యోగి మాట్లాడుతూ.. మానవాళి మనుగడకు పెను ప్రమాదమైన థర్మల్ పవర్ ప్లాంట్ వద్దని ఖండించారు. ప్రపంచ దేశాలు థర్మల్ పవర్ ప్లాంట్‌కు ప్రత్యామ్నాయాలు చూస్తున్నాయన్నారు. ఇక్కడ థర్మల్ పవర్ ప్లాంట్ తీసుకొచ్చి ఆదివాసీల నెత్తిన బొగ్గు కుంపటిని పెట్టడం దారుణమన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ సహాయ కార్యదర్శి వంకల మాధవ రావు, పలు గిరిజన గ్రామాల నుంచి వచ్చిన ఆదివాసీలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ సంఘం నాయకులు, ఆదివాసీలు

యూరియా కోసం పడిగాపులు



కొత్తూరు: మండల వ్యవసాయ కార్యాలయం ఎదుట వేచివున్న రైతులు



పాతపట్నం: యూరియా కోసం వేచి ఉన్న రైతులు


పాతపట్నం: మండలంలోని రైతులు యూరియా కోసం అష్టకష్టాలు పడుతున్నారు. సోమవారం మండలంలోని తెంబూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రానికి యూరియా వచ్చిందని రైతులుకు తెలియటంతో తెంబూరు, పెద్దలక్ష్మీపురం, రామచంద్రాపురం, వెంకటాపురం, పెద్దసరియాపల్లి, ద్వారకాపురం రైతులు వచ్చి బారులు తీరారు. ఏఓ పి.కిరణ్ వాణి, ఏఈఓ టి.భారతి చేరుకుని 220 యూరియా బస్తాలు వచ్చాయన్నారు. టోకెన్ ఉన్న రైతులుకు యూరియా అందజేశారు. మరో రెండు రోజుల్లో యూరియా మండలానికి రానుందని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు.

రైతుల నిరీక్షణ..

కొత్తూరు: మండల వ్యవసాయ కార్యాలయం ఎదుట యూరియా కోసం రైతులు సోమవారం గంటల తరబడి నిరీక్షించారు. మండలానికి యూరియా రావడంతో పలు గ్రామాలకు చెందిన రైతులు చేరుకున్నారు. ఆర్‌ఎస్‌కేల వద్ద టోకెన్లు పంపిణీ చేస్తారని అధికారులు చెప్పడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. కొత్తూరు, కర్లెమ్మతో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులుకు యూరియా పంపిణీ చేశారు.

అన్నసమారాధన

నరసన్నపేట: మండల కేంద్రంలోని మారుతీనగర్‌లో ఇటీవల నిర్వహించిన వినాయక ఉత్సవాల్లో భాగంగా సోమవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదాలను వడ్డించారు. పార్టీ నాయకులు చీపురు కృష్ణ, రఘుపాత్రుని శ్రీధర్ పాల్గొన్నారు.



భక్తులకు అన్నప్రసాదాలను వడ్డిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

ఆక్రమణలు తొలగించాలి

ఆమదాలవలస: మండలంలోని చిట్టివలసకు చెందిన సీర పోలమ్మకు మంజూరు చేసిన నకిలీ డీపట్టాను రద్దు చేయాలని, ఆమె కుమారుడు సైలాడ రెవెన్యూలోని సంఘమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో గల కొండ ప్రాంతంలో చేసిన ఆక్రమణలను తొలగించాలని ఆ గ్రామస్తులు కోరారు. ఆమదాలవలస తహసీల్దార్ ఎస్.రాంబాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. సైలాడ రెవెన్యూలో 296–1లోని 183 సర్వే నంబర్‌లో ఎకరా విస్తీర్ణం కలిగిన డీపట్టాను గతంలో పోలమ్మకు అందించినట్లు నకిలీ పట్టా సృష్టించి ఆక్రమణలకు పాల్పడుతున్నారన్నారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్‌కు, స్థానిక ఎమ్మెల్యేకు, మండల రెవెన్యూ అధికారికి పలుమార్లు ఫిర్యాదు చేశామన్నారు. ఆర్టీఐ యాక్ట్ ప్రకారం పూర్తి సమాచారాన్ని సేకరించామన్నారు. ఈ వినతిపత్రం అందించిన వారిలో బంటుపల్లి కూర్మారావు, గుజ్జల శ్రీనివాసరావు, లబ్బ వెంకటరమణ, కొరాడ రవికుమార్, పెద్దిన మధు, నూలు లక్ష్మణరావు, తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న చిట్టివలస గ్రామస్తులు

కృతజ్ఞతలు..



మాజీ స్పీకర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న వావిలపల్లి మురళి

ఆమదాలవలస: బూర్జ మండలంలోని డొంకలపర్తి సర్పంచ్ వావిలపల్లి మురళిని వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఇటీవల పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం జాయింట్ సెక్రటరీగా నియమించింది. మాజీ స్పీకర్, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు తమ్మినేని సీతారాంను ఆమదాలవలస పట్టణంలో ఆయన నివాసం వద్ద మురళి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ్మినేనిని సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మురళికి తమ్మినేని అభినందలు తెలిపారు. తమ్మినేని మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బూర్జ జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, చీడివలస సర్పంచ్ బూరి శ్రీరామ్మూర్తి, పార్టీ నాయకులు తొత్తడి సురేష్, అల్లెన మహేష్, ఉప్పినివలస వైస్ సర్పంచ్ కరణం అనిల్, జల్లు జగదీష్, తిర్లంగి రామారావు, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అప్రమత్తంగా ఉండాలి

పాతపట్నం: ఇంటి నుంచి బయలుదేరి పాఠశాలకు చేరే వరకు విద్యార్థినులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పాతపట్నం సీఐ ఎస్.సన్యాసినాయుడు సూచించారు. స్థానిక బ్రాహ్మణవీధిలో ఉన్న విక్టరీ పాఠశాలలో హెచ్‌ఎం శంకర్ నారాయణ ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై సోమవారం అవగాహన కల్పించారు. పరిచయం లేని వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. కొత్త వ్యక్తుల పట్ల ఆకర్షితులు కావద్దని, సోషల్ మీడియాలో లేనిపోని పరిచయాలు పెంచుకోవద్దన్నారు. చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు సన్మానం

హిరమండలం: ఎల్.ఎన్.పేట మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఇంజినీర్స్‌డే, హిందీ దివాస్ కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్మన్, దివ్యాంగ ఉద్యోగుల సంఘ రాష్ట్ర నాయకుడు మన్మథ్‌కుమార్ మిశ్రో ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. హిందీ భాష, విద్యా వ్యాప్తికి కృషి చేస్తున్న పెద్దకోట వెంకటరావు, లక్ష్మి దంపతులను సన్మానించారు. యంత్రాలను బాగుచేసే మబుగాపు సోమేశ్వరరావును సత్కరించారు. హెచ్‌ఎం రమాదేవి, వీఆర్వో రమణమ్మ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించండి

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో తెలుగు మీడియంను పునరుద్ధిరంచాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ అన్నారు. సోమవారం ఎల్.ఎన్.పేట మండలంలోని దొంకలబడవంజ, కొమ్మవలస, బొడ్డవలస, ధనుకువాడ, గొట్టిపల్లి, రోటరీ నగర్, మోదుగువలస తదితర ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు ఏ భాషలో చదువుకోవాలో వారికి స్వేచ్ఛనివ్వాలన్నారు. సంస్కరణల పేరుతో విద్యావ్యవస్థను నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మాతృభాష లేకుండా బోధన అనేది సాధ్యం కాదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంఘ సభ్యులు రామకృష్ణ, వెంకట్ పాల్గొన్నారు.

కార్డెన్ సెర్చ్..

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ గ్రామంలో స్థానిక ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ తన సిబ్బందితో సోమవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గంజాయి, మద్యం, నాటు సారా, ఇతర మత్తు పదార్థాలతో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి రికార్డులు లేని తొమ్మిది బైక్‌లను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.

పరామర్శ..

పొందూరు: పొందూరు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అనకాపల్లి సత్తిబాబు ఇటీవల మృతి చెందారు. సత్తిబాబు కుటుంబాన్ని పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ సోమవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, పొందూరు పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, పొందూరు వైస్ సర్పంచ్ అనకాపల్లి గోవింద, అనకాపల్లి రామకృష్ణ ఉన్నారు.



సత్తిబాబు కుటుంబాన్ని పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

మోక్షగుండంను మరిచిన ఇంజినీర్లు

పాతపట్నం: మండల కేంద్రంలోని ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ కార్యాలయం (పీఆర్ బంగ్లా) ఆవరణలో ఉన్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఇంజినీర్స్ డే పురస్కరించుకుని పూలమాల వేయడం, శుభ్రం చేయడాన్ని మరిచారు. ప్రతీ ఏడాది సెప్టెంబర్ 15వ తేదీన విశ్వేశ్వరయ్య పుట్టిన రోజున ఇంజినీర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. సోమవారం పీఆర్ కార్యాలయంలో ఉన్న విశ్వేశ్వరయ్య విగ్రహానికి ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ ఇంజినీర్లు పూలమాల వేయడాన్ని మరిచారు. పాతపట్నం ఇంజినీర్లకు మోక్షగుండంపై ఉన్న అభిమానం ఏమిటో దీన్ని చూస్తే అర్థమవుతోంది.



పీఆర్ డీఈఈ కార్యాలయంలో మోక్షగుండం విగ్రహం

విద్యుత్ ఉద్యోగుల నిరసన



సారవకోట: నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు



హిరమండలం: ఎల్.ఎన్.పేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సారవకోట: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో సోమవారం విద్యుత్ ఉద్యోగులు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలియజేశారు. తమ సమస్యల పరిష్కారానికి దశల వారి ఆందోళన చేపట్టనున్నట్లు విద్యుత్ సంఘం సభ్యుడు ఈశ్వరరావు తెలిపారు. రెండు రోజులపాటు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కానున్నట్లు తెలిపారు.

ప్రైవేటీకరణ తగదు

హిరమండలం: విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ ఆపాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఏపీ విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపుమేరకు హిరమండలం సెక్షన్ పరిధిలోని ఎల్.ఎన్.పేట, హిరమండలం సబ్‌స్టేషన్ల విద్యుత్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు.

ఎస్సీ, ఎస్టీల ఉచిత విద్యుత్‌కు మంగళం

- చంద్రబాబుది వంచన పాలన
- వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి



హిరమండలం: రాష్ట్రంలో వంచన పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పిన సీఎం చంద్రబాబు.. ఇప్పుడు రకరకాల చార్జీల పేరు అధిక మొత్తంలో పెంచడం దారుణమన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తే.. దానిని ఈ ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయమన్నారు. ఆడిన మాట తప్పడం, దబాయించడం చంద్రబాబుకు అలవాటైన విద్యగా అభివర్ణించారు. విద్యుత్ వ్యవస్థను అదానీకి అప్పగించేందుకు స్మార్ట్ మీటర్ల పేరిట పన్నాగం పన్నుతున్నారని ఆరోపించారు. నిరుపేద ఎస్సీ, ఎస్టీలను ఆర్థికంగా చేయూతనందించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి ఉచిత విద్యుత్ అందించిన విషయాన్ని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ

ఆమదాలవలస: శ్రీకృష్ణదేవరాయ కళా దర్బార్ ఆధ్వర్యంలో టీటీడీ సౌజన్యంతో తిరుపతిలో జరిగిన 35వ వార్షిక స్వర్ణోత్సవ నృత్య కళోత్సవాల్లో ఆదివారం పట్టణానికి చెందిన భవిత పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రదర్శనతో ప్రతిభను చాటారు. కూచిపూడి, భరతనాట్యం విభాగాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ్మినేని భూమి (3వ తరగతి), మెట్ట నేహా (7వ తరగతి), తమ్మినేని సాత్విక (9వ తరగతి), డబ్బీరు జస్మిత (9వ తరగతి) పలు అవార్డులను కైవసం చేసుకున్నారు. విద్యార్థినులను పాఠశాల డైరెక్టర్ సువ్వారి సునీత, హెచ్‌ఎం కిల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సోమవారం అభినందించారు.



నృత్య ప్రదర్శనలో భవిత విద్యార్థినులు

ఆర్థికసాయం

మెళియాపుట్టి: మండలంలోని ముక్తాపురం గ్రామ పంచాయతీలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నిరుపేద గిరిజన మహిళ సవర స్వర్ణకుమారి భర్త సవర రాజు (37) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. దహన కార్యక్రమాలకు తక్షణ సహాయం కింద మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు రూ.10 వేలను సంతోషపురం వెళ్లి అందించారు. సంఘం మండల అధ్యక్షుడు తిరుపతిరావు, లొడగల శ్రీనివాసరావు, సింహాచలం, రామారావు, తదితరులు ఉన్నారు.